క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రామ్‌చరణ్‌నాయక్‌తో పీఈటీ దేశ్‌ముఖ్

తంబళ్లపల్లె: స్థానిక గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి రామ్‌చరణ్ నాయక్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. మదనపల్లె ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్‌-14 విభాగం వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలలో స్థానం దక్కించుకున్నారు. ఈ నెల 8న విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో అతడు పాల్గొంటారని పీఈటీ దేశ్‌ముఖ్ తెలిపారు. ప్రిన్సిపల్ షబానా, ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, టీచర్లు విద్యార్థిని అభినందించారు.

11లోపు ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లించాలి

మదనపల్లె సిటీ: ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ నెల 11వతేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి తెలిపారు. ఆర్ట్స్, సైన్స్ కోర్సుల విద్యార్థులు రూ.600 చెల్లించాలన్నారు. సీనియర్ సైన్సు విద్యార్థులతో పాటు ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్స్ కోసం అదనంగా రూ.275 చెల్లించాలన్నారు. నవంబర్ 11వ తేదీ గడువు ముగిసిన తరువాత 12 నుంచి 20వ తేదీ వరకు రూ.1000 అపరాధ రుసుంతో కలిపి పరీక్ష ఫీజు చెల్లించాల్సి వుంటుందన్నారు. దివ్యాంగులు పరీక్ష ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

పెద్దమండ్యం: మండలంలోని బిక్కావాండ్లపల్లెలో సీతా రామ,లక్ష్మణ హనుమత్ సమేత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా తొలి రోజున గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి విగ్రహాలతో పొలిమేర వరకు వెళ్లి అక్కడ పూజల అనంతరం ఇరువైపులా గ్రామదేవతలకు పూజలు జరిపారు. అనంతరం విజయవాడ భువనేశ్వరీ పీఠం నుంచి వచ్చిన పీఠాధిపతి కమలానందభారతి స్వామికి గ్రామస్థులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదపండితులు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మణికంఠస్వామి, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల ఏర్పాటు

పెద్దతిప్పసముద్రం: ఈ నెల 4న సాక్షి పత్రికలో వెలువడిన కేంద్రాల మూత, విద్యార్థుల వెత వార్తపై అధికారులు స్పందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం అన్ని జెడ్పీ హైస్కూళ్లలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చొరవ చూపారు. మండలంలోని కందుకూరు జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ కేంద్రాన్ని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ పంచాయతీ కార్యదర్శి మనోహర్ పర్యవేక్షించారు.

ఆక్రమణలు తొలగించాలి

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించాలని మదనపల్లె టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు తెలిపారు. స్థానిక అవెన్యూరోడ్డు, గాంధీరోడ్డు, పటేల్‌రోడ్డు, చిత్తూరు, బెంగుళూరు బస్టాండు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించాలని ఆయన కోరారు. సీటీఎం రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం అభినందనీయన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

మదనపల్లె: మదనపల్లె ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పట్టణాలు, గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె సర్కిల్ పరిధిలో 22 ప్రైవేట్ మద్యం దుకాణాలకు రెండేళ్లపాటు అనుమతులు జారీ చేశామన్నారు. వ్యాపారులు ఎంఆర్‌పీ ధరలకే మద్యం విక్రయాలు జరపాలన్నారు. దుకాణాల పక్కన పర్మిట్ రూమ్ ఏర్పాటుచేయడం, లూస్ సేల్స్ చేయడం చేస్తే కేసులు పెట్టడంతోపాటు దుకాణాల లైసెన్స్ రద్దుకు సిఫారసు చేస్తామన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థలు, ఆలయాలు, ప్రార్థనామందిరాలకు వంద మీటర్ల దూరం లోపు మద్యం దుకాణాలు ఏర్పాటుచేయవద్దని సూచించారు. బెల్టు షాపులకు మద్యం విక్రయించినట్టు తమ తనిఖీల్లో తేలితే వారిపై కేసులు నమోదుచేస్తామని సీఐ హెచ్చరించారు.

ఇద్దరికి గాయాలు

కురబలకోట: మండలంలోని తెట్టు గ్రామం లో ఎదురెదురెదుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు రైతులు గాయపడ్డారు. పులుసుగంతలకు చెందిన రైతు రాము (52), తెట్టుకు చెందిన ఆదెప్ప (59) ఉన్నారు. వారిని మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కలప మాయం.. ఆదాయం శూన్యం

మదనపల్లె పట్టణంలోని సీటీఎం రోడ్డులో చింతచెట్ల కొట్టివేత అక్రమార్కులకు ఆదాయవనరుగా మారింది. ఫారెస్ట్, ఆర్‌అండ్‌బీ అధికారులు చేతులెత్తేయడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. కలప దర్జాగా కర్నాటకకు తరలిపోతోంది.

- సీటీఎం రోడ్డులో నరికిన చెట్లు మాయం
- చేతులెత్తేసిన ఫారెస్ట్, ఆర్‌అండ్‌బీ అధికారులు
- కర్నాటకకు కలప తరలిపోతున్నా పట్టించుకోని వైనం



కర్నాటకకు తరలించేందుకు లారీలో కలప నింపుతున్న కూలీలు



సీటీఎం రోడ్డులో నరికివేసిన చింతచెట్లు

మదనపల్లె : పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపారు. సీటీఎం రోడ్డులో ట్రాఫిక్ జామ్ కాకుండా చెట్ల నరికివేతకు శ్రీకారం చుట్టారు. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులను గ్రహించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ మదనపల్లెకు వచ్చినపుడు స్థానికులు సమస్య తెలుపడంతో చర్యలు చేపట్టారు. తర్వాత కొద్ది రోజులకు ఉన్న పళంగా చెట్లను నరికివేస్తున్నట్లు తెలిపారు. అయితే చెట్ల కత్తిరింపునకు అటవీ అధికారుల అనుమతి తీసుకోలేదు. అనంతరం పత్రికల్లో వార్తలు రావడంతో 2022లోనే 25 చింతచెట్లు, 1 రావిచెట్టు కొట్టివేతకు అనుమతులున్నాయని, ఆర్‌అండ్‌బీ అధికారులు చెట్లు తమవేనని ప్రకటించుకున్నప్పటికీ, కొట్టివేతతో తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరించారు.

కర్ణాటకకు కలప తరలింపు?

అధికార పార్టీ నాయకులు కర్నాటక నుంచి ఓ కాంట్రాక్టర్‌ను తీసుకువచ్చి 28 చెట్లు కొట్టివేయించారు. ప్రభుత్వం ఆధీనంలో ఉన్న భారీ చెట్లను కొట్టివేసే క్రమంలో ఎక్కడా నిబంధనలు పాటించలేదు. ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం ప్రకటన ఇచ్చాక... అందరి సమక్షంలో వేలం నిర్వహించి ప్రభుత్వానికి ఆదాయం కనపరచాలి. పాడుకున్న మొత్తం చెల్లించాకే, కలప రవాణాకు అటవీ అధికారులు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే రెండు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు ఈ నిబంధనలు పాటించలేదు. వందేళ్లకు పైబడిన 27 చింతచెట్లు... కొట్టివేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. ఒకొక్క చెట్టు సరాసరిన ఏడు టన్నులు వేసుకున్నా..189 టన్నుల కలప ఉంటుంది. దీని విలువ లక్షల రూపాయలు కావడం, ఇంత ఆదాయం పోతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమేమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక చింతకాయలు రోడ్డు పాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గండి కొట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ ఎఫ్‌ఆర్వో వేణుగోపాల్ వివరణ ఇస్తూ చెట్లు కొట్టివేతకు అనుమతులు ఇచ్చామని, కలప రవాణాకు అనుమతులు తీసుకుంటున్నారని తెలిపారు. ఏ ప్రాతిపదికన ట్రాన్సిట్ ఫారంలు ఇస్తున్నారంటే ఆర్‌అండ్‌బీ అధికారులను అడగండంటూ మాట దాటవేశారు. ఆర్‌అండ్‌బీ ఈఈ అరవిందాదేవి వివరణ కోరితే... కొట్టి వేసిన చెట్లను మరో ప్రదేశంలో భద్రపరుస్తున్నామని, తప్పనిసరిగా వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు. ఎక్కడ భద్రపరిచారో చెప్పండని అడిగితే... అలా చెప్పలేమని చెప్పుకొచ్చారు.

సైబర్ నేరాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌బీఐ కౌన్సిలర్ శ్రీనివాసప్రసాద్

తంబళ్లపల్లె: సైబర్ నేరాలపై వెలుగు మహిళా సంఘ సభ్యులకు అవగాహన ఉండాలని ఆర్‌బీఐ కౌన్సిలర్ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనం వద్ద ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో వచ్చే మెసేజ్‌లు, కొత్త వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్‌కు మహిళా సభ్యులు స్పందించరాదన్నారు. తెలిసిన వ్యక్తిగా పరిచయం తెలుసుకుని ఆధార్, ఓటీపీ తదితరాలను అడిగినప్పుడు తెలపరాదన్నారు. ఎక్కడబడితే అక్కడ వేలి ముద్ర వేయకూడదన్నారు. ఏటీఎం సెంటర్ల వద్ద పరిచయం లేని వ్యక్తులకు కార్డులు ఇచ్చి పిన్ నంబర్ చెప్పకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మి, సంఘమిత్రలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

టమాటా పంటకు వాతావరణ ఆధారిత బీమా



సమావేశంలో మాట్లాడుతున్న రవిచంద్రబాబు

కలికిరి: రబీ సీజన్‌లో టమాటా పంటకు అందించే వాతావరణ ఆధారిత బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి.రవిచంద్రబాబు కోరారు. స్థానిక కేవీకే కార్యాలయంలో పీలేరు, వాల్మీకిపురం వ్యవసాయ డివిజన్‌లోని ఉద్యాన, వ్యవసాయ సహాయకులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత నెల 15వ తేదీ నుంచి డిసెంబరు 15వ తేదీ వరకూ వాతావరణ పరిస్థితుల్లో మార్పులకు పంటనష్టం జరిగినందున రైతులకు అండగా ప్రభుత్వం బీమా సౌకర్యం తెచ్చిందన్నారు. జిల్లాకు ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని ఎంపిక చేశారని, రైతులు తమ పంటలకు ఎకరాకు రూ.1600 చెల్లించాల్సి ఉంటుందన్నారు. నష్టం జరిగితే ఎకరాకు రూ.32 వేల పరిహారం పొందవచ్చన్నారు. బ్యాంకులలో రుణం తీసుకున్న రైతులు అక్కడ బీమా అంగీకారపత్రం అందచేసినట్లయితే ఆ బ్యాంకు నేరుగా ప్రీమియం చెల్లించుకుంటుందన్నారు. పంట రుణం తీసుకోని రైతులు రైతు సేవా కేంద్రం, సీఎస్‌ఈ కేంద్రాలలో భూమి 1-బి, ఆధార్, బ్యాంక్ ఖాతా, పంట ధృవీకరణ పత్రం సమర్పించి వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త మంజుల, ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాస్, పీలేరు ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి, వాల్మీకిపురం ఇన్‌ఛార్జి అధికారి ఈశ్వర్‌ప్రసాద్ రెడ్డి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

కురబలకోట మాజీ సర్పంచ్ మృతి



రాఘవరావు (ఫైల్)

కురబలకోట: కురబలకోట మాజీ సర్పంచ్ కామకోటి రాఘవరావు (90) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. స్వల్ప అనారోగ్యంతో బుధ వారం బెంగళూరు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం కారులో బెంగళూరులోని చెల్లెలు ఇంటికి వెళ్లారు. తిరిగి అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రికి వెళుతుండగా గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఇతనికి ముగ్గురు కుమార్తెలు. వీరంతా అమెరికాలో ఉన్నారు. వారు వచ్చాక కురబలకోటలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న తహసీల్దారు ఫణి కుమార్

కలకడ: ప్రభుత్వ భూములను ఆక్రమణకులను అరికట్టే బాధ్యత రెవెన్యూ సిబ్బందిదే అని తహసీల్దారు ఫణికుమార్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వ భూములు, చుక్కల డీకెటీ భూములు, కాలువలు, చెరువులు కబ్జాకు గురవుతున్నట్లు పిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ప్రతి గ్రామంలో డాటెడ్ ల్యాండ్ వివరాలు తెలియజేయాలని ఆయన ఆదేశించారు. కోర్టు పరిధిలో ఉన్నవి మినహా మిగిలిన సర్వే, భాగ పరిష్కారం, కౌలతలకు సంబంధించిన భూములను రైతుల పేరిట నమోదుచేసి హక్కు దారుల పేర్లను ఆన్‌లైన్ చేయాలని సిబ్బందికి సూచించారు. నూతన బియ్యం కార్డుల మంజూరుకు దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. విద్యార్థులకు ఇంటిపేరు, పుట్టిన తేదీ నమోదు వంటివి ఆధార్‌లో సమస్యలున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని, ఏ విద్యార్థి కోరినా వెంటనే స్పందించి ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేయకుండా వివరాలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు, సర్వేయర్, వీఆర్‌ఓ పాల్గొన్నారు.

సర్వశిక్షా అభియాన్ ట్రైనింగ్ రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సదాశివారెడ్డి

పీలేరు రూరల్: సర్వ శిక్షా అభియాన్ ట్రైనింగ్‌ను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదాశివారెడ్డి అన్నారు. పీలేరులో బుధవారం నిర్వహించిన యూటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లీడర్‌షిప్, ఎఫ్‌ఎల్‌ఎన్ ట్రైనింగ్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. అరకొర వసతులతో వారం రోజులపాటు మారుమూల ప్రాంతాల్లో శిక్షణ ఇస్తే.. 50 ఏళ్లు పైబడినవారికి ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. పలువురు షుగర్, బీపీ, గుండె జబ్బులు, మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా శిక్షణ ఇవ్వడం బాధాకరమన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో ఓ హెడ్మాస్టర్ ట్రైనింగ్ పొందుతూ మృతి చెందడం బాధాకరమని తెలిపారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ నాయకులు శివారెడ్డి, చంద్ర శేఖర్, విశ్వనాథరెడ్డి, సుధాకర్, వేణుగోపాల్, మహమ్మద్ రఫీ, శెట్టి సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, విజయ్‌కుమార్, వెంకటరమణ, ఉదయ్‌కిరణ్, ఈశ్వర్ మహేంద్ర, చెంగారెడ్డి, అక్రమ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పేరుతో శిక్షించొద్దు

రాయచోటి టౌన్: ఉపాధ్యాయులను శిక్షణ పేరుతో మానసిక ఆందోళనకు గురి చేయరాదని ఆపస్ అన్నమయ్యజిల్లా సంఘం అధ్యక్షులు ఎం.నరసింహులు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటికే వివిధ యాప్‌లు, అనేక రకాల పనులతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇది చాలదన్నట్లు స్కూల్ లీడర్ షిప్ ట్రైనింగ్, ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ రెసిడెన్షియల్ ట్రైనింగ్‌దూర ప్రాంతాలలో నిర్వహించడంతో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతారని తెలిపారు. ఇలాంటి శిక్షణలు మండల కేంద్రాలలో నిర్వహించాలని సూచించారు.

పాఠశాలకు లయన్స్ క్లబ్ సభ్యుల చేయూత



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు వైవీ.రమణ

కలకడ: లయన్స్ క్లబ్ సభ్యుల చేయూత మరువలేనిదని కలకడ క్లస్టర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెడ్మాస్టర్ వైవీ.రమణ అన్నారు. మండలంలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు వరుస విజేతలను ఎంపిక చేశారు. అనంతరం కలకడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోటీలలో విజేతలకు బుధవారం నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వైవీ.రమణ మాట్లాడుతూ కె.బాటవారిపల్లె పాఠశాల అభివృద్ధికి లయన్స్ క్లబ్ సభ్యులు కృషి చేశారన్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధిలో పాలు పంచుకుంటున్న లయన్స్ క్లబ్ చైర్మెన్ దగ్గుపాటి వేంకటేశ్వరరావు, గౌతంరెడ్డి, భాస్కర్ ఆచారి, పునీత్ చౌదరి, బాబురెడ్డి, కె.శ్రీనివాసులురెడ్డి, వైవీ.రమణ, తిరుపతినాయుడు, జె.శ్రీనివాసులు, తదితరులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

అంటువ్యాధులపై బాలికలకు అవగాహన



అంటువ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైస్ ప్రిన్సిపల్ అనిత

కలకడ: సీజనల్‌గా వచ్చే అంటువ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని వైస్ ప్రిన్సిపల్ అనిత, కృషి సంస్థ సభ్యులు జాబీర్ హుస్సేన్ అన్నారు. స్థానిక కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం మీకు తెలుసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్‌లో బాగంగా అవగాహన కార్యక్ర లు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 2023 నాటికి 25.44 లక్షల మంది హెచ్‌ఐవీతో జీవిస్తున్నారని, వాటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, ధనలక్ష్మి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ముక్కు మూసుకుని నడవాల్సిందే



మండలంలోని టి.సదుం పంచాయతీ పరిధిలోని చెన్నరాయునిపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాలంటే ముక్కు మూసుకుని నడవాల్సిందే. పాఠశాల ఎదురుగా మురికి కాలువ నిండి దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. చిన్న పిల్లలు ఈ మార్గంలో తిరుగుతుండడంతో దోమ కాటుకు గురై జ్వరాల బారిన పడాల్సి వస్తుందని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– పెద్దతిప్పసముద్రం

వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తెస్తాం

- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు: వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తెస్తామని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని వేపుల బైలులో తమ పార్టీ నాయకులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు అమలుకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎండకట్టాలని, వారికి అండగా ఉంటామని తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్దన్‌రెడ్డి కుమార్తె వివాహ కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హబీబ్‌బాషా, చెంగల్‌రాయుడు, నాగభూషణం రెడ్డి, వీపీ.రమేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, యర్రమరెడ్డి, చక్రధర్, ఆనంద్, షాకీర్, మునీర్, అబీద్, దావూద్, శివ, పవన్‌కుమార్‌రెడ్డి, ఉబేదుల్లా, ఆదినారాయణ, దేవరాజు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి



కలికిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక శాఖ అధికారి మధుబాబు, తదితరులు

కలికిరి: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కార్మిక శాఖ అధికారి మధుబాబు కోరారు. మండలంలో బుధవారం పలు హోటళ్లు, దుకాణాలు, మెకానిక్ షాపులు, గ్యారేజీలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని, సంపాదన కోసం తమ పిల్లలను తల్లిదండ్రులు పనులకు పంపితే శిక్షార్హులవుతారన్నారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీయూ సామాజిక కార్యకర్త లావణ్య, మహిళ పీసీ వజ్రావతి, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి



విజేతలను అభినందిస్తున్న వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్

కలకడ: మహిళలు అన్ని రంగాలలో రాణించాలని స్థానిక ఆదర్శ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మహిళా సాధికారత అంశంపై పాఠశాల విద్యార్థులకు బుధవారం పోటీలు నిర్వహించారు. వరుస విజేతలుగా నిలిచిన మిన్హ, మోక్షశ్రీ, దైవిక్‌రెడ్డిలకు నగదు బహుమతులను పాఠశాల విద్యా కమిటీ చెర్మెన్ రమేష్ నాయుడు అందజేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని రంగాలలో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని గుర్తుచేశారు. విద్యతోపాటు, క్రీడల్లో బాల, బాలికలు రాణించి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం



ఎన్నికల ప్రచారంలో ఎంప్లాయిస్ సంఘ్‌నేతలు

రాజంపేట : భారతీయ రైల్వేలలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే, జోన్, డివిజన్ స్థాయిలో ఎంప్లాయిస్ సంఘ్‌ను అత్యధిక మెజార్టీ ఓట్లతో గెలిపించాలని ఎంప్లాయిస్ సంఘ్ నేతలు సెక్షన్‌లలో బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇండియన్ రైల్వేలో కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేసే ఏకైక కార్మిక సంఘం ఎన్ఎఫ్ఐఆర్ దాని అనుబంధ సంస్థ సంఘ్ అని పేర్గొన్నారు. జాతీయనేత మర్రి రాఘవయ్య నేతృత్వంలో ఎన్ఎఫ్ఐఆర్, ఎంప్లాయిస్ సంఘ్‌లు కార్మికుల పక్షాన నిలబడి వారికి అండగా నిలుస్తోందన్నారు. ఈ ప్రచారంలో నందలూరు బ్రాంచి తరపున సెక్రటరీ వై.రవిప్రకాశ్, చైర్మన్ పెంచలయ్య, కార్యవర్గ సభ్యులు, బీఈసీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు. రాజంపేట, పుల్లంపేట, హస్తవరంలోని ఎల్‌సీగేట్స్‌తోపాటు భాకారాపేట నుంచి ఓబులవారిపల్లె వరకు ఉన్న అన్ని ఎల్‌సీగేట్స్‌లో కార్మికులను కలుసుకోని ఓట్లను అభ్యర్థించారు. కార్మికులను కలుసుకొని ఓట్ల వేయాలని కోరారు.

ఆధార్ కేంద్రం మూత



గుర్రంకొండలో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రం మూతపడింది. గత కొద్ది రోజుల వరకూ రోజూ 120 నుంచి 150 మంది వరకు ఇక్కడ సేవలు లభించాయి. పెద్దమండ్యం, కలకడ, సంబేపల్లె మండలాల ప్రజలు తరలివస్తున్నారు. అయితే ఇన్‌ఛార్జ్ అధికారి అయిన బ్రాంచ్ పోస్టుమాస్టర్ అందుబాటులో లేకపోవడంతో తాజాగా ఆధార్ సేవలు నిలిపివేశారు. నాలుగు మండలాల ప్రజలు రోజుల తరబడి కేంద్రం చుట్టూ తిరగలేక నానా కష్టాలు పడుతున్నారు. పోస్టల్ అసిస్టెంట్ సోమశేఖర్ వివరణ కోరగా బ్రాంచ్ పోస్టు మాస్టర్ బాబ్‌జాన్ వేలిముద్ర, పాస్‌వర్డ్ అవసరం కావడంతో ఆయన సెలవు ముగిసే వరకు కేంద్రంలో సేవలు లభించవన్నారు.

– గుర్రంకొండ

మధ్యంతర భృతి ప్రకటించాలి

రాయచోటి టౌన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఎస్‌టీయూ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులురాజు అన్నారు. ఈమేరకు శాసనమండలి సభ్యులు అశోక్ బాబుకు బుధవారం విజయవాడలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ ప్రభుత్వంపై మధ్యంతర భృతి ప్రకటనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. నమ్మకాలను వమ్ము చేయకుండా త్వరగా మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో బకాయిలు చెల్లించేలా చొరవ చూపాలన్నారు. ఎస్‌టీయూ నాయకులు ఏబీ కృష్ణమరాజు, వెంకట్రామ రాజు పాల్గొన్నారు.

26న దేశ వ్యాప్తంగా నిరసనలు

గాలివీడు: దేశంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజా సమస్యల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబర్ 26వ తేదీన దేశ వ్యాప్తంగా నిరసనలు విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి కోరారు. ఇందుకోసం ఈనెల 8వ తేదీన రాయచోటిలో రైతు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమావేశం జరుపనున్నట్లు ఆయన బుధవారం గాలివీడులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న ఆర్జీలతో కూడిన హెచ్చరికలు జారీ చేయాలని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం తన విధానాలను ఏమాత్రం మార్చుకోలేదన్నారు. రైతులు పండిస్తున్న అన్ని పంటలకూ కనీస మద్దతు ధర చెల్లించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేరళలో అమలవుతున్న వంట రుణ ఉపశమన చట్టాన్ని దేశ వ్యాప్తంగా అమలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.